వంద సార్లయినా జైలుకెళ్తా

మొదటిపేజీ తరువాయి...

వెనకడుగు వేయబోమని స్పష్టంచేశారు. లగచర్లలో ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు ఘటన దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ నేతలపై ఆ నెపం నెడుతున్నారని విమర్శించారు. లగచర్ల ఘటనలో మొత్తం 55 మందిని అదుపులోకి తీసుకొని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలను వదిలేసి బీఆర్ఎస్ కార్యకర్తలను మాత్రమే చిత్రహింసలకు గురిచేయడం దారుణమని మండిపడ్డారు. రూ. 50 లక్షల లంచం డబ్బులతో దొరికిన రేవంత్‌రెడ్డి శాడిజంతో ఏదో రకంగా తనను అక్రమ కేసులో ఇరికించాలని చూస్తున్నారని, 11 నెలల్లో ఇలాంటి కుట్రలు అనేకం పన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు బయటకు రావాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ గట్టి కౌంటర్ ఇచ్చారు. తమ ప్రశ్నలకే భయపడుతున్న చిట్టినాయుడు, సింహంలాంటి కేసీఆర్ బయటకొస్తే తట్టుకోగలడా? అని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో గురువారం 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేటీఆర్ అనేక అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న: లగచర్ల ఘటన బీఆర్ఎస్ కుట్ర అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు?

కేటీఆర్: ప్రభుత్వ నిర్ణయం మీద ప్రజలు బహిరంగంగా తిరుగుబాటు చేశారు. ఇందులో కుట్ర ఏముంది? రూ. 50 లక్షల లంచం డబ్బులతో దొరికిన నీకు (రేవంత్) అన్నీ కుట్రలాగానే కనిపిస్తాయి. మీ అల్లుడి కంపెనీ కోసం లాక్కుంటున్న భూములకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న పోరాటం కుట్రగానే కనిపిస్తుంది. మీ అన్న బెదిరింపులకు లొంగని రైతన్నల ధైర్యం కుట్రగానే కనిపిస్తుంది. ఇద్దరు వ్యక్తులు ఫోన్లో మాట్లాడుకున్నా కుట్రలాగనే కనిపిస్తుంది. ప్రజలు సోషల్ మీడియాలో తమ బాధలు పోస్ట్ చేస్తే కుట్రగానే కనిపిస్తుంది. పేద గిరిజన రైతులకు అండగా నిలబడితే అది కుట్రగానే అనిపిస్తుంది. తొమ్మిది నెలలపాటు నీ అపాయింట్‌మెంట్ కోసం వేచి చూసి, నీ బెదిరింపులన్నీ తట్టుకొని, చివరికి ఎదిరిస్తే అది నీకు కుట్ర లాగానే అనిపిస్తుంది. పేద రైతన్నల కుటుంబాల మీద అర్ధరాత్రి దాడులు చేసి, అక్రమంగా అరెస్టు చేసి, వారిని చిత్రహింసలకు గురిచేసినప్పుడు నేను ప్రశ్నిస్తే కుట్రలాగానే అనిపిస్తుంది. ప్రతినిత్యం భయంతో బతికే నీకు ఇవన్నీ కుట్ర లాగానే అనిపిస్తాయి.

లగచర్ల ఘటనకు బాధ్యులెవరు?

లగచర్ల ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యత. తొమ్మిది నెలలుగా అక్కడి ప్రజలు నిరసన తెలుపుతున్నా వారిని ప్రభుత్వం పట్టించుకోలేదు. సొంత నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన ముఖ్యమంత్రిగానీ, పరిశ్రమలశాఖ మంత్రిగానీ పట్టించుకోలేదు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు వినలేదు. ప్రభుత్వం తమ భూములు లాకుంటున్న భయాందోళనతో ప్రజలు తిరగబడ్డారు. ప్రభుత్వానికి ఎదురైన భంగపాటును కవర్ చేసుకునేందుకే ఇది కుట్ర అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నది. సీఎంకు తన సొంత నియోజకవర్గంపై కూడా పట్టు లేదా? అసలు నువ్వేం సీఎంవి. సీఎం నియోజకవర్గంలో కలెక్టర్‌పై దాడి చేసేంత బలమైన వ్యక్తులమా మేము? అలా మేము చేయగలిగితే ఈ ప్రభుత్వం ఉన్నది ఎందుకు? మేము చెబితే రైతులు దాడులు చేస్తారా? ఆ ఊళ్లో కాంగ్రెస్ పార్టీకే అధిక మెజార్టీ వచ్చింది. ఇది సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం. సీఎం నియోజకవర్గానికి బీఆర్ఎస్ పార్టీ వెళ్లి కుట్ర చేసే సీన్ ఉంటుందా? అన్ని పార్టీలకు చెందిన ప్రజలు తిరుగుబాటు చేశారు. నిజంగా లగచర్లలో మేము కుట్ర చేసినట్లయితే మీడియా వాళ్లు వెళ్లి ఫ్యాక్ట్‌చెక్ చేసుకోవచ్చు. మీరు ఆ గ్రామానికి వెళ్తే ప్రజలే ఏమీ జరిగిందో చెప్తారు. నిజంగా లగచర్లలో మేము కుట్ర చేసినట్లయితే మీడియా వాళ్లు వెళ్లి ఫ్యాక్ట్‌చెక్ చేసుకోవచ్చు. మీరు ఆ గ్రామానికి వెళ్తే ప్రజలే ఏమీ జరిగిందో చెప్తారు.

ప్రతిసారి కేటీఆర్‌నే కాంగ్రెస్ ఎందుకు టార్గెట్ చేస్తున్నది?

రేవంత్‌రెడ్డికి నేనంటే చాలా ప్రేమ ఉన్నట్టు ఉంది. అందుకే నన్ను టార్గెట్ చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న. నన్ను అరెస్టు చేసి ప్రశ్నించే గొంతు నొక్కాలని మొదటి నుంచి సీఎం కుట్రపన్నుతున్నారు. డ్రగ్స్ కేసు అన్నారు.. నేను డ్రగ్స్ తీసుకోలేదు కనుక చిక్కలేదు. ఫోన్ల ట్యాపింగ్ అన్నారు. నేను చేయించలేదు కనక దొరకలేదు. ఈ-కార్‌రేస్‌లో ఉచ్చు అన్నారు. అవినీతి చేయలేదు కాబట్టి చిక్కలేదు. చివరికి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తున్నట్టు ఆరోపణ మోపి అక్రమ కేసులో ఇరికించాలని చూస్తున్నారు. మోడీనే మోడీయా.. బో డీయా? ఏం చేసుకుంటావో చేసుకో అన్నాను. ఇప్పుడు చిట్టినాయుడికీ అదే చెప్తున్న ఏం చేసుకుంటావో చేసుకో. ఎంత ధైర్యం ఉంటే నేను ఈ మాట అనగలుగుతాను. నిజాయితీకి ఉన్న ధైర్యమే అది.

రైతుల అనుమానాలు ఎవరూ తీర్చలేదా?

సీఎం సొంత నియోజకవర్గంలో పరిశ్రమలు పెట్టాలి అనుకున్నప్పుడు ఎన్నిసార్లు వారితో సమావేశం అయ్యారు? ఎన్నిసార్లు ఆ ప్రయత్నం చేశారు? ప్రజలకు అనుమానాలు ఉన్నప్పుడు వాటిని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద, అక్కడి ఎమ్మెల్యే అయిన సీఎం రేవంత్‌రెడ్డికి లేదా ? కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఫార్మా సిటీకి 14 వేల ఎకరాలు సేకరించినప్పుడు ప్రజలను ఒప్పించి సమకూర్చి పెట్టారు. 2013 భూసేకరణ చట్టం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందే. అందులో ఉన్న అనేక ఆటంకాలను అధిగమించి కేసీఆర్ ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరించారు. దానిని పక్కన పెట్టడం వెనక రేవంత్‌రెడ్డి అంతర్యమేమిటి?

లగచర్ల ఘటనలో మిమ్మల్ని అరెస్టు చేస్తారనే వార్తలపై మీ స్పందన?

గొంతులేని వారికి గొంతుక అయ్యా. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం అన్నింటికీ సిద్ధంగా ఉన్నా. ఇప్పటికే నాలుగైదు సార్లు అక్రమ కేసుల్లో ఇరికించాలని ప్రయత్నించారు. అన్నింటికీ సిద్ధపడే ఉన్న. నా మీద కేసు పెడితే నేను ఊరుకుంటా అనుకుంటే రేవంత్‌రెడ్డి అంత పిచ్చోడు మరొకరు ఉండరు. జైలు నుంచి వచ్చాక కూడా మరింత దూకుడుగా పోరాటం చేస్తా.

రైతులను ఎస్పీ దగ్గరుండి కొట్టించారని మీరు ఎలా ఆరోపిస్తారు? ఏమైనా ఆధారాలు ఉన్నాయా?

లగిచర్లలో అర్ధరాత్రి వేళ ఇండ్లు, పొలాలపై పడి 55 మంది రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారేమైనా తీవ్రవాదులా? మెడికల్ ఎగ్జామిన్ చేయకుండా తీసుకెళ్లారు. మీడియాలో రైతుల నడక తీరుచూస్తుంటే పోలీసులు కొట్టారని తెలియడం లేదా? ఈ ఘటన జరిగినప్పుడు అక్కడ లేని బీఆర్ఎస్ కార్యకర్తలను కూడా తీసుకెళ్లి అమానుషంగా కొట్టారు.

లగచర్ల ఘటన వెనుక ఇంటెలిజెన్స్ వైఫల్యం ఏమైనా ఉన్నదా?

అవును. లగచర్ల ఘటనలో పూర్తిగా ఇంటెలిజెన్స్, పోలీసుల వైఫల్యం ఉన్నది. అభిప్రాయ సేకరణ జరుగుతున్న సమయంలో పోలీసులు ఎందుకు అక్కడ లేరు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక భూముల ధరలు భారీగా పెరిగాయి. రైతులకు ఆ భూమిలే ఆసరా అయ్యాయి. అలాంటి భూములను గుంజుకుంటా అంటే వారికి కోపం రాదా? కడుపు మండిన రైతులు తిరగబడతారని తెలియదా? నిఘా వ్యవస్థ నిద్రపోతున్నదా? మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఏదో నా పేరు చెప్పాడని రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు రాశారు. కానీ, అదంతా బక్వాస్ అని ఆయన లేఖ రాశారు. దాని ఆధారంగా హైకోర్టుకు వెళ్తాం.

పదేండ్ల క్రితం ఇలాంటి ఘటనలు తలెత్తకుండా భూసేకరణ ఎలా జరిపారు?

బీఆర్ఎస్ హయాంలో అనేక రిజర్వాయర్లు, ప్రాజెక్టుల నిర్మాణం, ఫార్మాసిటీ కోసం ప్రజలను ఒప్పించి భూములు తీసుకున్నాం. కేసీఆర్ ముచ్చర్లలో మంచి ఉద్దేశంతో ఫార్మాసిటీని పెట్టారు. అందుకోసం చైనాకు వెళ్లి అక్కడ 70 వేల ఎకరాల్లో ఉన్న తయారీ పరిశ్రమను పరిశీలించి వచ్చారు. ఎకానమీ ఆఫ్ స్కేల్ అనే ప్రయోజనం ఉండేలా ఫార్మాసిటీని ప్లాన్ చేశారు. ఫార్మాసిటీ కోసం 8 ఏండ్లు కష్టపడ్డాం. 14 వేల ఎకరాల భూమి సేకరించాం. కొడంగల్‌లో భూముల సేకరణకే ఇంత గొడవ జరిగితే ముచ్చర్లలో ఎంతో విలువైన భూములు ఉన్నాయి. వాటిని సేకరించే విషయంలో ఇంకా ఎంత గొడవ జరగాలి? కానీ, మేము రైతులను ఒప్పించి వారికి నచ్చచెప్పి భూసేకరణ చేశాం. బీఆర్ఎస్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలం వందలమార్లు భూసేకరణ కోసం ప్రజల వద్దకు వెళ్లి వంగి వంగి దండాలు పెట్టి వారిని ఒప్పించాం. అప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, కోదండరెడ్డి తదితరులు భూములు ఇవ్వవద్దని రైతులను రెచ్చగొట్టారు. కాంగ్రెస్ నేతల మాదిరిగా ఎకరాకు రూ.20 లక్షలు అడగండి, రూ.30 లక్షలు అడగండి అని ప్రజలను మేము ఎవరం రెచ్చగొట్టడం లేదు కదా? కేసులు సమస్యలకు పరిష్కారం కాదు. ప్రజలను ఒప్పించి, మెప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది.

సీఎంపై పరుషపదజాలం వాడుతున్నారనే అభియోగంపై మీ స్పందన..

కుక్కకాటుకు చెప్పు దెబ్బ అన్నట్టుగా ఉండాల్సిందే.. రేవంత్‌రెడ్డి మాత్రం పేగులు మెడలో వేసుకుంటా, లాగులో తొండలు వదులుతా.. గుండ్లు పీకి గోటీలాడుతా.. కేసీఆర్‌ను ఫినిష్ చేస్తా అనొచ్చు.. మేము మాత్రం ఏమీ అనొద్దా? మేమేమీ మునీశ్వరులం కాదు. సర్వసంగ పరిత్యాగులం కాదు. కచ్చితంగా స్పందనకు ప్రతిస్పందన ఉంటుంది. తిట్టుకు మరింత ఘాటైన తిట్టుతోనే సమాధానం చెప్తాం. ఈ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఫినిష్ చేస్తా అంటాడు. ముందు నువ్వు ఫినిష్ కాకుండా చూసుకో. నీ పదవికి ఎసరు పెట్టడానికి నల్లగొండ, ఖమ్మం బాంబులు వేచి చూస్తున్నాయి.

అధికారం పోయిందనే ఫ్రస్ట్రేషన్

అధికారం పోయిందని నాకు ఎలాంటి ఫ్రస్ట్రేషన్ లేదు. అసలు అధికారం వస్తుందని కలలో కూడా నేను ఊహించలేదు. పదేండ్లు ప్రజలు మాకు అవకాశం ఇవ్వడాన్ని అదృష్టంగా భావించా. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఐదేండ్లు ఉండాలని నేను కోరుకుంటున్న. వాళ్లు పూర్తికాలం అధికారంలో ఉంటేనే మళ్లీ బీఆర్ఎస్ 15 ఏండ్లపాటు అధికారంలోకి ఉంటుంది. దేశంలో ఎన్నికల సంస్కరణలు చేస్తే ఒక వ్యక్తి రెండు టర్మ్‌ల కన్నా ఎక్కువ సార్లు సీఎం, పీఎం ఉండకుండా చేయాలని కోరుత.

ఫార్మా భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాధ్యమవుతుందా?

ఫార్మాసిటీ కోసం మేము సేకరించిన భూమి అంతా కూడా కండీషనల్ ల్యాండ్. ఆ భూమిని వేరే అవసరాలకు వాడటానికి వీలు లేదు. కానీ, రేవంత్‌రెడ్డి హైకోర్టు కూడా తప్పుదోవ పట్టిస్తున్నారు. కోర్టులో ఫార్మాసిటీ ఉన్నది అంటారు. బయట రద్దయింది అంటారు. ఒకసారి ఫోర్త్‌సిటీ అంటారు. మరోసారి ఫ్యూచర్‌సిటీ అంటారు. ఇంకోసారి ఏఐసిటీ అంటారు. మరోసారేమో స్కిల్ యూనివర్సిటీ అంటారు. ఈ సిటీల కోసం ఈ ప్రభుత్వం ఒక్క ఎకరం ల్యాండ్ అయినా సేకరించిందా? ఫార్మాసిటీ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తే ఊరుకోం. ప్రజలను ఎప్పటికీ మోసం చేస్తామంటే కుదరదు.

మీది కుటుంబ పాలన అన్నారని, మీరూ రేవంత్ కుటుంబంపై ఆరోపిస్తున్నారా?

లేదు. మేమంతా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ద్వారా ప్రజాక్షేత్రంలోకి వచ్చాం. నేనుగానీ, హరీశ్‌రావుగానీ, కవితగానీ ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల ఓట్లతో గెలిచి చట్టసభల్లో అడుగుపెట్టాం. కానీ, రేవంత్‌రెడ్డి సోదరులు మాత్రం రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారు. ఏ హోదాలో కలెక్టర్ కార్యాలయాలకు వస్తున్నారు. ప్రభుత్వ వ్యవహారాల్లో తలదూర్చుతున్నారు. రేవంత్‌రెడ్డి తన బావమరిదికి అమృత్ టెండర్లు కట్టబెట్టారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి అనధికారికంగా అధికారం చెలాయిస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మా పార్టీ ఎమ్మెల్యేలను లగచర్లకు వెళ్లకుండా అడ్డుకుంటారు. స్థానిక బీజేపీ ఎంపీ డీకే అరుణను ప్రజలను, రైతులను కలవకుండా పోలీసులు వెనక్కి పంపిస్తారు. కనీసం వార్డ్ మెంబర్ కూడా కానీ సీఎం సోదరుడు తిరుపతిరెడ్డిని 200 వాహనాలతో అనుమతిస్తారా? దీనికి డీజీపీ బాధ్యత వహించరా? తిరుపతిరెడ్డికి ఎదురేగి కలెక్టర్ ఎలా స్వాగతం పలుకుతారు?

కేసీఆర్ ఎప్పుడు బయటకొస్తారు?

ఇచ్చిన హామీలు అమలుపై మాకే రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పలేక భయపడుతున్నారు. ఇక సింహంలాంటి కేసీఆర్ వస్తే తట్టుకోగలరా? ప్రతి అంశంలో కేసీఆర్ యాది చేసుకుంటున్నరు. కేసీఆర్ మౌనానికి కూడా రేవంత్ జడుసుకుంటున్నరు. ఆయన ఎప్పుడు బయటకు రావాలో తెలుసు.

ప్రజా విజయోత్సవాలపై మీ అభిప్రాయం

ఈ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు కాదు.. అర గ్యారెంటీ అమలు చేసిందా? రైతుబంధు ఇచ్చిందా? రుణమాఫీ పూర్తిచేసిందా? పెంచుతానన్న పింఛన్ పెంచిందా? తులం బంగారం ఇచ్చిందా? ఏ హామీలు అమలుచేసిందని ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నది? సెక్యూరిటీ లేకుండా ప్రజల మధ్యకు వెళ్తే ప్రజాపాలనో.. పాశవిక పాలనో తెలుస్తుంది.

ఈ కార్‌రేసు రాజీకోసమే ఢిల్లీ వెళ్లారని అంటున్నారు?

నేను ఢిల్లీకి పోయింది కాంగ్రెస్ వాళ్ల మీద ఫిర్యాదు చేయడానికి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్లలో గోల్‌మాల్ జరుగుతున్నది. రేవంత్‌రెడ్డి తన బామ్మర్దికి అమృతం పంచి ప్రజలకు విషం పంచాలని చూస్తున్నారు. చర్యలు తీసుకోండి. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కింద చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశాను. అమృత్ టెండర్ల స్కామ్‌లో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. బీజేపీతో దోస్తీ మాకు అవసరం లేదు. కానీ, కాంగ్రెస్ వాళ్లు ఇక్కడ గల్లీల్లోనే బీజేపీతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు. తెలంగాణలో ఆర్ఆర్ (రాహుల్-రేవంత్) ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపిస్తారు.. కానీ, చర్యలు తీసుకోరు. ఇది బడేభాయ్.. చోటేభాయ్ మధ్య ఉన్న బంధానికి సాక్ష్యం కాదా? కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీగా పనిచేస్తున్నరు?

నరేందర్‌రెడ్డి 40 సార్లు సురేశ్‌కు ఫోన్‌చేశారని పోలీసులు చెప్తున్నారు? నిజమేనా?



పూర్తి అబద్ధం. ఘటన జరిగిన 12వ తేదీనాడు ఒక్కసారిగా కూడా మాట్లాడలేదు. 11వ తేదీనాడు ఒక్కసారి మాట్లాడారు. అక్టోబర్ నుంచి కాల్‌డాటా తీసి 40సార్లు ఫోన్‌చేసినట్టుగా చిత్రీకరిస్తున్నారు. కార్యకర్తల నుంచి ఫోన్లు వచ్చినంత మాత్రాన పట్నం నరేందర్‌రెడ్డి నిందితుడు అవుతారా? నరేందర్‌రెడ్డి కేటీఆర్‌కు ఫోన్ చేసినంత మాత్రాన కేటీఆర్ నిందితుడు అవుతారా? మరి అదే రోజు నేను వ్యవసాయ అధికారులకు, డీజీపీకి కాల్ చేశాను. వారిని కూడా నిందితులుగా చేరుస్తారా? మీకు ఓట్లేసి గెలిపించిన ప్రజల మీద కత్తికడతారా? సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఎలా భూములివ్వరో చూస్తాం అని చెప్పడం సమంజసమా? నరేందర్‌రెడ్డి ఏదైనా గ్రామానికి వెళ్లి ప్రజలను రెచ్చగొట్టారా? ప్రతిపక్ష పార్టీ నేతగా కచ్చితంగా ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల తరపున ప్రశ్నిస్తారు. అందులో తప్పేముంది? మీరు ప్రజలకు మేలు కలిగే పనిచేస్తే వారికి నచ్చచెప్పి ఒప్పించండి. జిల్లా మేజిస్ట్రేట్ అయిన కలెక్టర్ స్వయంగా తన మీద ఎలాంటి దాడి చేయలేదు అన్న మాటలు ఇప్పటికే రికార్డ్ అయి ఉన్నాయి. నిరక్షరాస్యులైన రైతులకు ఎవరు ఆర్డీవో, ఎవరు కలెక్టర్ అనే విషయం తెలుస్తుందా ? జరిగిన ఘటన మీద కక్షగట్టి వ్యవహరిస్తారా? పెద్ద మనసుతో జరిగిన ఘటన మీద సమీక్ష చేసుకోరా? ప్రభుత్వం నడిపే విధానం ఇదేనా?

11 నెలల్లోనే ఇంతలా ప్రజావ్యతిరేకతకు కారణాలు ఏమిటి?

వీళ్లకు ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదు. ప్రాజెక్టులు ఎలా పూర్తి చేయాలో తెలియడం లేదు. ప్రాజెక్టులు కట్టాలంటే, పెట్టుబడులు తేవాలంటే ఎంతో కష్టపడాలి. మా ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు హరీశ్‌రావు ఎంత కష్టపడ్డారో గుర్తులేదా? రూ.16,000 కోట్లతో మూసీ పునరుజ్జీవం జరిగేలా మేము అన్నీ సిద్ధం చేశాం. కానీ, మూసీ పునరుజ్జీవం పేరుతో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తారంట. ఇప్పుడు ప్రైవేట్ వాళ్లే మూసీ ప్రాజెక్టు చేపడతారని కొత్త రాగం అందుకున్నారు. ప్రైవేట్ సంస్థలు ఏ లాభం లేకుండా ప్రాజెక్టులు కడతాయా? అయినా పేదోడి ఇల్లు ఉంటే మురుగు నీళ్లు వస్తాయని అంటున్నారు. ఇల్లు కూలగొట్టి పెద్ద బిల్డింగ్‌లు కడితే వాటి నుంచి సుగంధం వస్తుందా? అసలు వీళ్ల డీపీఆరే లేదు అంటున్నారు. మరి డీపీఆర్ లేకుండా ఎందుకు ముందుకు వెళ్తున్నట్టు. పేదల ఇండ్లు ఎందుకు కూల్చుతున్నట్టు? కేవలం ఢిల్లీకి మూటలు పంపించేందుకే మూసీ ప్రాజెక్ట్‌ను ముందు పెట్టుకున్నారు. మూసీమే లూటో ఢిల్లీమే బాటో.. అనేది కాంగ్రెస్ సిద్ధాంతం.

ఫార్మాసిటీ అని మీరంటే.. ఫార్మా విలేజ్ అని ఈ సర్కారు అంటున్నది తేడా ఏమిటి?

కేసీఆర్ ఎడ్డెం అంటే.. మనం తెడ్డెం అనాలనేది రేవంత్‌రెడ్డి పాలసీ. కేసీఆర్ చేసిన దానికి వ్యతిరేకంగా చేయాలన్న ఉద్దేశంతోనే ఫార్మాసిటీకి ఫార్మా విలేజ్ అని పేరు మార్చి మేము చేసిన దానికి విరుద్ధంగా చేస్తున్నారు. 14 వేల ఎకరాల్లో ఒకే చోట పరిశ్రమలు ఉండాలనే ఆలోచనలో ఫార్మాసిటీ అన్నాం. ఫార్మాసిటీ పర్మిషన్ కోసం కేంద్రంలో ఉన్న వాళ్లు చెప్పిన అన్ని కండిషన్స్ ఒప్పుకోని 18 నెలలు కష్టపడితే పర్మిషన్ వచ్చింది. ఇప్పుడు ఆయన ప్రతిపాదిస్తున్న ఫార్మా విలేజ్‌లకు పర్మిషన్ రావడానికి కూడా ఏడాదికిపైగా సమయం పడుతుంది. ఈ ముఖ్యమంత్రికి ఏమీ తెలియదు. అందుకే రాగానే ఫార్మాసిటీ రద్దు అంటూ ప్రకటన చేసేశాడు. రేవంత్‌రెడ్డి 20 చోట్ల ఫార్మా విలేజ్‌లు పెడతా అంటున్నారు. ఆ పేరుతో రియల్ ఎస్టేట్ దందాకు ప్రయత్నిస్తున్నారు. వెల్దండలో వాళ్ల బంధువులు, కుటుంబ సభ్యులకు భూములు ఉన్నాయి. ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అంటూ రేవంత్‌రెడ్డి మాటలు చెప్తున్నారు. కానీ సాధ్యం కాదు. నేను గతంలో పరిశ్రమల మంత్రిగా చేసిన అనుభవంతో చెప్తున్న ఒక చోటు నుంచి మరొక ప్లేస్‌కు పరిశ్రమలను తరలించటం అనేది అంత సులువైన పని కాదు.

రైతులను కొట్టిన అంశం మానవ హక్కుల సంఘం దృష్టికి తీసుకెళ్తరా?

రాష్ట్రంలో ఇంత అరాచకం జరుగుతుంటే గతంలో మానవ హక్కుల గురించి మాట్లాడిన కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్‌లాంటి వాళ్లు ఎందుకు మాట్లాడటం లేదు. ఈ అంశంపై బాధితులను ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్‌ను కూడా కలుస్తాం. రేవంత్‌రెడ్డి సర్కారు అమానవీయ చర్యలు జాతీయ స్థాయిలో ఎండగడతాం.

పోలీసులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా? చట్టపరిధిలో పనిచేయడం లేదా?

పోలీసులు రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా వ్యవహరిస్తూ రైతులను ఇష్టమొచ్చినట్లు కొట్టారు. రైతులపై దాడికి పోలీసులు కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్లినట్టు వెళ్లారు. ఒక అమ్మాయి ఛాతీ మీద కాలు పెట్టి ఆమె భర్తను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఆ విషయాన్ని ఆ అమ్మాయి మీడియాతో చెప్తూ ఎంతో ఆవేదన వ్యక్తం చేసింది. సామాన్య ప్రజలపై ఇంత దారుణంగా వ్యవహరిస్తారా? పోలీసులు, ఐపీఎస్ అధికారులకు ఇంత స్వామి భక్తి ఉండొద్దు. మళ్లీ నాలుగేండ్ల తర్వాత మేమే అధికారంలోకి వస్తాం. తప్పు చేసిన అధికారుల విషయంలో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతుందో అదే జరుగుతుంది.

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం వెళ్తున్నదని మీరు భావిస్తున్నారా?

అవును. ప్రజలు వద్దన్నా కచ్చితంగా చేస్తాం అంటే చూస్తూ ఊరుకోవాలా? తెలంగాణలో ఏమైనా రాచరికం నడుస్తుందా? రాజ్యం చట్టాన్ని అడ్డగోలుగా వాడుకుంటుంది అంటే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవు. బీఆర్ఎస్ నేతల మీద ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి. ఇక్కడ ఎవరూ కేసులకు భయపడేవారు లేరు. కోర్టుల్లో తేల్చుకుంటాం. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం.

పట్నంపై కేసు కుట్రపూరితం

బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ సోమ భరత్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): లగచర్ల దాడి ఘటనలో ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందని బీఆర్ఎస్ లీగల్‌సెల్ కన్వీనర్ సోమ భరత్‌కుమార్ పేర్కొన్నారు. దాడి తో ఎలాంటి సంబంధం లేని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. చర్లపల్లి సెంట్రల్ జైలు వద్ద నరేందర్‌రెడ్డిని కలిసి వచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా పట్నంపై కేసులు బనాయించారని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని మండిపడ్డారు. తాము పట్నంను కలిసినప్పుడు ఆయన ఒక అఫిడవిట్ ఇచ్చారని, అందులో తానేమీ చెప్పకుండానే రిమాండ్ రిపోర్ట్ తయారు చేసినట్టు నరేందర్‌రెడ్డి చెప్పారని భరత్ పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ కుట్రపూరితంగా కేటీఆర్‌తో పాటు ఇతర నేతలను ఈ కేసులో చేరుస్తున్నారని మండిపడ్డారు. నరేందర్‌రెడ్డి అరెస్ట్ విషయంలో కొడంగల్ పోలీసుల తీరు శోచనీయమని, కేటీఆర్ పేరుగాని, ఇతరుల పేరుగాని తానుచెప్పలేదని నరేందర్‌రెడ్డి చెప్పారని పేర్కొన్నారు.

నరేందర్‌రెడ్డి బెయిల్ కోసం పిటిషన్ వేసిన బీఆర్ఎస్ లీగల్ టీం సభ్యులు

నరేందర్‌రెడ్డి బెయిల్ కోసం పిటిషన్

వికారాబాద్, నవంబర్ 14: లగచర్ల ఘటన కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని వికారాబాద్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. బీఆర్ఎస్ లీగల్ టీమ్ తరఫున న్యాయవాదులు శుభప్రద్ పటేల్, రాంచందర్‌రావు, రమేశ్‌గౌడ్, అశోక్, వెంకట్‌రెడ్డి, జగన్, వేణుగోపాల్‌రావు, లక్ష్మణ్, పరమేశ్ తదితరులు గురువారం వికారాబాద్ జిల్లా కోర్టులో ఈ పిటిషన్ వేశారు. అంతకు ముందు నోటీసు ఇవ్వడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను లీగల్ టీమ్ కలవగా, నోటీసు తీసుకోవడానికి నిరాకరించారు. న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాలతో ఎట్టకేలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆ నోటీసును స్వీకరించారు. అనంతరం నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను సోమవారానికి వాయిదా వేసినట్టు బీఆర్ఎస్ లీగల్ టీం సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ కుట్రతోనే కేసు

- రాజకీయ కక్షతో అరెస్టు
- లగచర్ల ఘటనతో సంబంధం లేదు
- ఏకపక్షంగా ఉన్న కోర్టు ఉత్తర్వులు
- సుప్రీం మార్గదర్శకాలను పట్టించుకోలే
- కేసు కొట్టేయండి.. రిమాండ్‌పై స్టే విధించండి
- హైకోర్టులో నరేందర్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం తనపై కుట్రపూరితంగా నమోదు చేయించిన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, కొండగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, జిల్లా అధికారులపై జరిగిన దాడి ఘటనలో తన ప్రమేయం లేదని, రాజకీయ ప్రేరేపితంతోనే కేసు నమోదు చేశారని తెలిపారు. కొడంగల్‌లోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తనకు విధించిన రిమాండ్ చట్టవిరుద్ధమని ప్రకటించాలని కోరారు. తుది ఉత్తర్వులు జారీ చేసేలోగా రిమాండ్ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు నరేందర్‌రెడ్డి గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాన్ని, వికారాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

యాంత్రికంగా వ్యవహరించిన మేజిస్ట్రేట్ కోర్టు

బొమ్రాస్‌పేట్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కింది కోర్టు యాంత్రికంగా ఆమోదించి రిమాండ్ ఉత్తర్వులు జారీచేసిందని నరేందర్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 2న లగచర్ల గ్రామంలో జరిగిన సంఘటనకు సంబంధించి వికారాబాద్-సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి చేసిన ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు సంబంధించిన భూసేకరణ కోసం పబ్లిక్ హియరింగ్ జరుగుతున్నదని, ప్రభుత్వ అధికారులపై భూ బాధితులు దాడి చేస్తే దానికి తనను బాధ్యుడ్ని చేయడం అన్యాయమని అన్నారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, వాళ్లు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తనను అన్యాయంగా నిందితుడ్ని చేశారని తెలిపారు. తనను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. తనను జ్యుడీషియల్ కస్టడీకి పంపిన కింది కోర్టు ఉత్తర్వులు ఏకపక్షంగా ఉన్నాయని, సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేయలేదని తెలిపారు. రిమాండ్ డైరీలో పేర్కొన్న విధంగా పిటిషనర్ అరెస్టును సమర్థించే కారణాలను తనకు గానీ తన భార్యకు గానీ తెలియజేయలేదని తప్పుపట్టారు. ప్రబీర్ పుర్కాయస్థ వర్సెస్ ఢిల్లీ రాష్ట్రం మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలను అమలు చేయడంలో మేజిస్ట్రేట్ విఫలమయ్యారని పేర్కొన్నారు. పోలీసులు ఏకపక్షంగా, దుర్మార్గంగా, రాజకీయ కక్షతో కేసు నమోదు చేశారనే వాస్తవాన్ని మేజిస్ట్రేట్ విస్మరించారని తెలిపారు. రాజ్యాంగంలోని 22వ అధికరణం ప్రకారం అరెస్టుకు కారణాల గురించి తెలుసుకునే హక్కు తనకు ఉన్నదని, ఈ విషయాన్ని మేజిస్ట్రేట్ విస్మరించారని అన్నారు. ఏదైనా ప్రాథమిక హక్కు ఉల్లంఘన జరిగి అరెస్టు జరిగితే ఆ ప్రక్రియను ఆర్టికల్ 22 అడ్డుకుంటుందని గుర్తుచేశారు. తనను జ్యుడీషియల్ కస్టడీకి తరలించే ముందు.. సుప్రీం కోర్టు డీకే బసు-పశ్చిమ బెంగాల్ మధ్య జరిగిన కేసులోని మార్గదర్శకాలను అమలు చేయడంలో మేజిస్ట్రేట్ విఫలం అయ్యారని తెలిపారు. రిమాండ్ డైరీలో పేర్కొన్న ఆరోపణలు సెక్షన్ 109 ప్రకారం చెల్లవన్నారు. అధికారులు పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండా ప్రజలు రాళ్లు రువ్వేందుకు తాను ప్రోత్సహించాననే అభియోగాలకు అర్థం లేదని తెలిపారు. ప్రజలు ఎవరూ కావాలని అధికారులపై దాడి చేయరని అన్నారు. ప్రభుత్వ అధికారులకు, దాడికి పాల్పడిన వ్యక్తులకు మధ్య ఎలాంటి శత్రుత్వం ఉండదనే వాస్తవ విషయాన్ని గుర్తెరగాలని కోరారు. రిమాండ్ కేసు డైరీలో పేర్కొన్న ఆరోపణలు బీఎన్ఎస్ 109 సెక్షన్ ప్రకారం శిక్షార్హమైన నేరాన్ని మోపేందుకు ఆధారాలు ఏమీ చూపలేదని తెలిపారు.ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని కొడంగల్ కోర్టు జారీచేసిన రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని హైకోర్టును కోరారు. తుది ఉత్తర్వులు జారీచేసే వరకు రిమాండ్ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

అది పోలీసులు అల్లిన కట్టుకథ!

మొదటిపేజీ తరువాయి...

విభేదిస్తున్నానని పేర్కొన్నారు. చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండులో ఉన్న నరేందర్‌రెడ్డి ఈ మేరకు గురువారం తన న్యాయవాదులకు అఫిడవిట్ అందించారు. దానిని కొడంగల్ జ్యుడీషియల్ కోర్టులో దాఖలు చేయాల్సిందిగా కోరారు. రెండు రోజుల క్రితం ఉదయం 7 గంటలకు కేబీఆర్ పార్కు వద్ద ఉన్న తనను మఫ్టీలో ఉన్న పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఉదయం 9.30-10:00 గంటలకు పరిగి డీటీసీకి తీసుకువెళ్లి నిర్బంధించారని, ఈ క్రమంలో ఏ ఒక్క పోలీసు కూడా తనతో మాట్లాడలేదని, తాను ఎలాంటి స్టేట్‌మెంటూ ఇవ్వలేదని స్పష్టంచేశారు. పోలీసులు తనను ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించి, కొన్ని పేపర్లపై సంతకాలు తీసుకున్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆ తర్వాత కేవలం పది నిమిషాల వ్యవధిలోనే న్యాయమూర్తి ముందు హాజరుపరిచారని తెలిపారు. తనను ఈ కేసులో ఏ-1గా చేర్చారన్న విషయం సాయంత్రం 4.30 గంటల వరకు పోలీసులు చెబితేగానీ తెలియలేదని పేర్కొన్నారు. అన్యాయంగా తనను ఈ కేసులో ఏ-1గా చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టేంత వరకు కూడా తనను అరెస్టు చేసినట్టు తన భార్య, కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం ఇవ్వలేదని వివరించారు. తమ పార్టీ నాయకుడు కేటీఆర్, ఇతరుల సూచనల మేరకు ఈ కేసులో తాను కీలక పాత్ర పోషించినట్టుగా పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చాననే కట్టుకథను పోలీసు వాంగ్మూలంలో పేర్కొన్నారని, దీన్ని గురువారం తన భార్య చెబితే విని ఆశ్చర్యపోయానని అన్నారు. తాను పోలీసులకు వాం గ్మూలం ఇచ్చాననేది ఒట్టి బూటకమని స్పష్టంచేశారు. తన రాజకీయ ప్రత్యర్థులు, వ్యతిరేకుల ఆదేశానుసారం పోలీసులు చేసిన ఆరోపణలన్నింటితో తాను తీవ్రంగా విభేదిస్తున్నానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఈ వాస్తవాలన్నింటినీ పరిగణలోనికి తీసుకుని, తగిన న్యాయం చేసేలా ఉత్తర్వులు జారీచేయాలని నరేందర్‌రెడ్డి తన అఫిడవిట్‌లో మెజిస్ట్రేట్‌ను కోరారు.

సంగారెడ్డి జైలుకు లగచర్ల రైతులు

పరిగి, నవంబర్ 14: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై దాడి ఘటనలో అరెస్టు చేసి పరిగి సబ్‌జైలులో ఉంచిన 16 మంది రైతులను గురువారం సంగారెడ్డి జైలుకు తరలించారు. పరిగి సబ్ జైలు కొడంగల్‌కు సమీపంలోనే ఉన్నది. దీంతో ములాఖత్ కోసం ఎక్కువ మంది వస్తున్నారనే కారణంతోనే సంగారెడ్డి జైలుకు పోలీసు బందోబస్తు మధ్య తరలించారని సమాచారం.